సాక్షి
మంచిర్యాల
సోమవారం ⁝ 24 ⁝ జూలై ⁝ 2023

మద్యం మాన్పిస్తున్నారు..!



మద్యపానం అలవాటు వ్యసనంగా మారి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. డీ అడిక్షన్ కేంద్రాలు కౌన్సెలింగ్ ద్వారా వందలాది మందిని మద్యం మాన్పించాయి. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: సేవా భారతి, తెలుగు తేజం జాతీయస్థాయి పురస్కారాల కోసం ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ ఆల్‌దిబెస్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు ఈఎస్ఎస్. నారాయణ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని వివిధరంగాల్లో సేవలు అందిస్తున్న నిర్వాహకులకు పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన నిర్వాహకులు తగిన ఆధారాలతో ఈనెల 30 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /25.2

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: మండలంలోని లంబాడితండాలో కొత్తగా ప్రారంభించిన మేముసైతం గ్రంథాలయానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పుస్తకాలను వితరణ చేశారు. ఆదివారం గ్రంథాలయాన్ని సందర్శించి నిర్వాహకుడు రంగ ప్రశాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్థాయిలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం, నిరుద్యోగులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం ఆదర్శనీయమన్నారు. అనంతరం పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. గ్రంథాలయ నిర్వాహకుడు ప్రశాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, సర్పంచ్ రాయమల్లు, ఎంపీటీసీ శకుంతల, మేము సైతం ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు రంగ ప్రశాంత్, అధ్యక్షుడు బోగ సత్యం, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రంగ రాజేశ్వరి, రంగ మల్లేశ్ పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



దక్షిణామూర్తిని సన్మానిస్తున్న కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి స్కూల్ ఆవరణలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. కవి దక్షిణామూర్తి ప్రసంగిస్తూ దాశరథిని అభ్యుదయ కవిగా అభివర్ణించారు. తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ అగ్నిధారాలుగా నిజాం పరిపాలనను ఎండగడుతూ ఈచల్లని సముద్ర గర్భంలో ఎన్నోబడబాగ్నులు రగులుతున్నాయని కవిత్వంతో నినదించారన్నారు. ఎన్నో భక్తి, యుక్తి, శృంగారభరితమైన సినీ గేయాలను అందించారని పేర్కొన్నారు . ఈసందర్భంగా దక్షిణామూర్తిని సన్మానించారు. కవులు మలయశ్రీ, భుజంగరావు, అల్లాడి శ్రీనివాస్, ప్రసాద్, అడ్డగూరి శ్రీలక్ష్మి, హైమావతి, తదితర కవితలు అలరించాయి. కార్యక్రమంలో కవులు, రచయితలు భూపతి సంతోష్, జగన్మోహన్‌రావు, రజిత, ప్రమీల, రాజేశ్వరి, శ్రీనాథ్‌గౌడ్, సుగుణాకర్, నందమయ్య, సంతోష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేకు సన్మానం



ఠాక్రేను సన్మానిస్తున్న రామిళ్ల రాధిక

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకురాలు రామిల్ల రాధిక హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం కలిశారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఠాక్రే సూచించారని రాధిక తెలిపారు.

ఆశ వర్కర్లకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో విద్య, వైద్యానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆశ వర్కర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆశ వర్కర్ల వేతనాలను రూ.9 వేలకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. బీఆర్‌టీయూ(భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆశావర్కర్ల అనుబంధ సంఘం) రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషి మాట్లాడుతూ ఆశ వర్కర్లను మెడికల్ ఆఫీసర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సర్వే చేసేందుకు అవసరమైన పేపర్ల జిరాక్స్‌లను తమనే తీసుకోవాలని, ప్రతీరోజు సర్వేల పేరిట ఇంటింటికీ పంపిస్తున్నారని వివరించారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకుడు ఏనుగు రవీందర్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు గరిగంటి సరోజ, ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి ఆకుల వాణి, కోశాధికారి చొప్పరి పద్మ, పీహెచ్‌సీల అధ్యక్షులు లీల, స్వప్న, ఉమ, లక్ష్మి పాల్గొన్నారు.

షెడ్లకు చేరని వీధి వ్యాపారం!



మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రహరీని ఆనుకుని నిర్మించిన వీధి విక్రయదారుల షెడ్లు

- జిల్లా కేంద్రంలో మూడుచోట్ల నిర్మాణం
- రోడ్లపై అమ్మకుండా చర్యలంటూ నిధుల కేటాయింపు
- షెడ్ల కేటాయింపులో అధికారుల అలసత్వం
- ఎండ, వానలోనే కొనసాగుతున్న వీధి వ్యాపారాలు..

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి జిల్లా కేంద్రంలో విక్రయాలు జరుపుతున్న వీధి వ్యాపారులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ కూర్చుని అమ్మకాలు జరుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో మూడేళ్ల క్రితం మున్సిపల్ నిధులు రూ.22 లక్షలతో ఐబీ చౌరస్తా, పాతమంచిర్యాల, ప్రభుత్వ ఐటీఐ ప్రహరీని ఆనుకుని షెడ్లు నిర్మించారు. రూ.7.50 లక్షలతో ఐబీ చౌరస్తాలోని ఐబీ ప్రహరీని ఆనుకుని 25 దుకాణాలు, ప్రభుత్వ ఐటీఐ ప్రహరీని ఆనుకుని 15 షాపులు, పాతమంచిర్యాలలోని నీటిట్యాంకు ప్రహరీని ఆనుకుని 15 షాపులు వచ్చేలా మొత్తం రూ.22 లక్షలతో నిర్మాణాలు చేపట్టారు. వాటిని ఎవరికీ కేటాయించకపోవడంతో మూడేళ్లుగా నిరుపయోగంగానే ఉంచడంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

కేటాయింపులో జాప్యం..

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు ఎవరికీ కేటాయించకపోవడంతో రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. వీధి వ్యాపారులందరికీ షెడ్లు ఇవ్వడం సాధ్యం కాకపోయినా కొన్నిప్రాంతాల్లోని వారికైనా అందించి రోడ్లపై ఇబ్బందులు పడకుండా చూసేందుకు అవకాశం ఉంది. ఆ బాధ్యత మున్సిపల్ అధికారులదే అయినా పట్టించుకోవడం లేదు. వీధి వ్యాపారులు షెడ్లలోకి వెళ్తే మాత్రం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉంది. ముఖ్యమైన కూడలిగా ఉన్న ఐబీ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. ఇక్కడ షెడ్లు ఉన్నా వీధి వ్యాపారులు రోడ్లపైనే కూర్చుని అమ్మకాలు చేస్తున్నారు. దీంతో పట్టణ ప్రగతి, పట్టణ సుందరీకరణలో భాగంగా తీసుకుంటున్న చర్యలు వీధి వ్యాపారులను షెడ్‌లోకి పంపించేందుకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు.

తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చి పండ్లు, కూరగాయలు, పూలు, బట్టలతో పాటు, వివిధ రకాల సరుకులు, వస్తువులు తోపుడు బండ్లపై, గంపల్లో పెట్టుకుని విక్రయించే వీధి వ్యాపారులు ఎండా వాన అనే తేడా లేకుండా రోడ్లపైనే నిత్యం విక్రయాలు జరుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వారిని ఒకచోటు నుంచి మరోచోటుకు తరలించడం వల్ల వ్యాపారం దెబ్బతింటోంది. వర్షం పడితే పక్కనే తలదాచుకుంటూ, వర్షం తగ్గిన తరువాత మళ్లీ రోడ్లపైకి వచ్చి తెచ్చిన వాటిని అమ్ముకుంటున్నారు.

షెడ్లలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం



వీధి వ్యాపారులు రోడ్లపై విక్రయాలు జరపకుండా ఉండేందుకు మున్సిపాలిటీ పరిధిలోని మూడుచోట్ల షెడ్లను నిర్మించాం. ఐబీ చౌరస్తాలో వీధి విక్రయదారులకు వాటిని ఇచ్చేందుకు ప్రయత్నించినా అందులో వ్యాపారం చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వర్షాలకు రోడ్ల మీద కూర్చుని విక్రయాలు జరుపుతున్న వారిని ఆ షెడ్లలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల

క్వాలిటీ లేని క్యాంటీన్



జైపూర్‌లోని సింగరేణి పవర్ ప్లాంటు క్యాంటీన్

- ఎస్‌టీపీపీ కార్మికులకు శాపం
- నాసిరకంగా స్నాక్స్, టిఫిన్స్
- వంటకాల్లో 'నార్త్' డామినేషన్
- టెండరూ నార్త్ స్టేట్ ఉద్యోగికే..

జైపూర్: దేశంలోనే విద్యుత్ ఉత్పత్తిలో మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును అగ్రగామిగా నిలిపేందుకు కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. అయితే వీరికి యాజమాన్యం కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్లాంటు ఆవరణలోని క్యాంటీన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నాసిరకమైన స్నాక్స్, క్వాలిటీ లేని టిఫిన్స్, భోజనం అందిస్తూ కాంట్రాక్టర్ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కంపెనీలో ఉద్యోగం చేస్తున్న నార్త్ స్టేట్‌కు చెందిన వ్యక్తికే క్యాంటీన్ టెండర్ అప్పగించడంతో మొదటి నుంచి క్యాంటీన్‌లో నార్త్ డామినేషన్ ఎక్కువగా ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. వంటకాల్లోనూ నార్త్ ఇండియన్ ఐటమ్స్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారని, నాణ్యత లేని ఆహారపదార్థాలు సబ్సిడీపై అందిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల వరుసగా స్నాక్స్, ఆహారంలో పురుగులు రావడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. క్యాంటీన్‌లో కూడా శుభ్రత పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

విధుల్లో 1,500 మంది కార్మికులు..

జైపూర్ మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ(ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) ఆంధ్రా ప్రాంతానికి చెందిన పవర్ మేక్ కంపెనీ చేపడుతోంది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు మొత్తం 1,500 మంది ఆయా విభాగాల్లో ఉద్యోగులుగా, కార్మికులుగా పని చేస్తున్నారు. కార్మికుల కోసం యాజమాన్యం పవర్ ప్లాంటులో క్యాంటీన్ ఏర్పాటు చేసింది. ఇందులో ఉద్యోగులు, కార్మికులకు సబ్సిడీపై ఆహారం అందించాలని నిర్ణయించింది.

ఉద్యోగి చేతికే క్యాంటీన్

క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను పవర్‌మేక్ కంపెనీలో ఉన్నత ఉద్యోగం చేస్తున్న నార్త్ స్టేట్‌కు చెందిన వ్యక్తికి యాజమాన్యం క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను అప్పగించింది. సదరు ఉద్యోగి ఇంతకుముందు కొనసాగిన స్టీగ్ కంపెనీలో సైతం పని చేశాడు. తనకు అధికారులతో ఉన్న సంబంధాలు, పలుకుబడి ఉపయోగించుకుని క్యాంటీన్ నిర్వహణ టెండర్ కూడా దక్కించుకున్నాడు. నార్త్‌కు చెందిన ఆ వ్యక్తి తెలుగు రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇష్టపడే ఆహారపదార్థాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. నాణ్యతతో కూడిన స్నాక్స్, టిఫిన్స్ భోజన వంటకాలు అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం సరుకులతో వంటకాలు తయారు చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ధరలు కూడా ఎక్కువగా ఉంటున్నాయని పేర్కొంటున్నారు. మెనూ, ధరలను యాజమాన్యం నిర్ణయించినప్పటికీ కాంట్రాక్టర్ వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



ఇటీవల పురుగులు పట్టిన శనగలతో చేసిన టిఫిన్

కాంట్రాక్టర్ తీరుతోనే..

సాధారణంగా కంపెనీ కార్మికుల కోసం క్యాంటీన్లలో సబ్సిడీపై ఆహారం అందిస్తోంది. జైపూర్ ప్లాంటులో మాత్రం అధికారులు క్యాంటీన్ నిర్వహణను సరైన వ్యక్తికి కేటాయించకపోవడంతో తమకు ప్రయోజనం ఉండడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. ఇటీవల వరుసగా క్యాంటీన్ ఆహారంలో పురుగులు రావడమే క్యాంటీన్‌లో నాణ్యతకు అద్దం పడుతోందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్సిడీపై కార్మికులకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వారి వేదన అరణ్య రోదనే..



గర్భిణిని నడిపించుకుంటూ తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు



స్ట్రెచర్‌పై రోగిని తీసుకువస్తున్న 108 సిబ్బంది

గతేదాది కురిసిన భారీ వర్షాలకు వేమనపల్లి మండలం మల్లంపేట అటవీ ప్రాంతంలోని కల్వర్టు కోతకు గురైంది. మరమ్మతుల విషయంలో ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో వేమనపల్లి మండలంలోని 35 గ్రామాలకు, దహెగాం, కన్నెపల్లి, నెన్నెల మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైతే అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి. ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు గర్భిణులు, ఒక జ్వరబాధితుడు ఆస్పత్రి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. నీల్వాయి గ్రామానికి చెందిన సన్యాసికి తీవ్రమైన జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వాహనం నీల్వాయి మీదుగా అటవీమార్గం గుండా కల్వర్టు వద్దకు వచ్చింది. బాధితుడిని ఆటోలో గ్రామం నుంచి కల్వర్టు వద్దకు తీసుకొచ్చారు. దీంతో సిబ్బంది ముజ్జు, శ్రీనివాస్ స్ట్రెచర్‌తో కల్వర్టు దాటి బాధితుడిని తీసుకొచ్చారు. నాగారాం, కొత్తపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులు జె.స్వప్న, దుర్గం లావణ్యకు పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ గ్రామాల్లోకి వచ్చే మార్గం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పురిటి నొప్పులతో బాధపడిన గర్భిణులను సుమారు అర కిలోమీటర్ నడిపించుకుని కల్వర్టు వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి అంబులెన్సుల్లో చెన్నూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

- వేమనపల్లి(బెల్లంపల్లి)

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పట్టణంలోని 15వ వార్డుకు చెందిన నల్ల రమేశ్ ఆధ్వర్యంలో 250 మంది, 7వ వార్డులో సాయి ఆధ్వర్యంలో 100 మంది యువకులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను చూసి ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కౌన్సిలర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేశ్, ఓబీసీ జిల్లా చైర్మన్ వడ్డే రాజమొగిలి, పట్టణ ఉపాధ్యక్షుడు జోగుల సదానందం, సరస్వతి, బుద్దార్థి శంకర్, అజయ్, ప్రకాశ్, ఖదీర్, సాయి పాల్గొన్నారు.

'కొక్కిరాల'కు శుభాకాంక్షల వెల్లువ

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఎన్నికల కమిటీ సభ్యులుగా ఎన్నికైన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు ఆదివారం జిల్లాలోని పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఉట్నూర్ జెడ్పీటీసీ, రాష్ట్ర ఎన్నికల క్యాంపెయిన్ కమిటీ మెంబర్ చారులత రాథోడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల తిరుమలరావు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల ప్రెసిడెంట్ మల్లారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి ఖాలీద్, నాయకులు జావిద్, ఆడెపు రవి, రచ్చ నరేశ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి'లో పడిపోయిన నీటిమట్టం



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నిలిచిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీటి ప్రవాహం తగ్గిపోవడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం 15 టీఎంసీలకు పడిపోయింది. శనివారం 18 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టులోని గేట్లను వరుసగా ఎత్తడంతో 3 టీఎంసీల నీరు గోదావరిలో కలిసిపోయింది. ఆదివారం రాత్రి వరకు ఎల్లంపల్లి తాజా వివరాలు ఇలా ఉన్నాయి.. హాజీపూర్ మండలంలోని గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి (శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవల్ కాగా 146.43 మీటర్లు ఉంది. 20.175 టీఎంసీలకు గానూ 15.959 టీఎంసీల నీటిమట్టం ఉంది.

ఇన్–అవుట్ ఫ్లో వివరాలు

ప్రస్తుతం ఇన్‌ఫ్లో కింద దాదాపు 41,517 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. ఇందులో కడెం ప్రాజెక్ట్ నుంచి 3,055 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 38,462 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. అవుట్‌ఫ్లో కింద 20,490 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇందులో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 298 క్యూసెక్కులు తరలిస్తుండగా ప్రాజెక్ట్‌లోని 4 గేట్లు ఎత్తి 20,192 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఇంజనీరింగ్ చీఫ్

రామగుండం రీజియన్ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ చీఫ్(ఈఎన్‌సీ) నల్ల వెంకటేశ్వర్లు ఆదివారం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు. ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేతను పరిశీలించి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రాజెక్ట్ ఈఈ విష్ణుప్రసాద్, డెప్యూటీ ఈఎన్‌సీ దస్తగిరి, డీఈఈ కీర్తి, ఏఈఈ స్నిగ్ధ ఉన్నారు.

క్లుప్తంగా

యువకుడి మృతదేహం లభ్యం


అంజన్న(ఫైల్)

వాంకిడి: మండలంలోని బోర్దా గ్రామానికి చెందిన సెండె అంజన్న(18) కాల కృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ సమీపంలోని ఒర్రె వద్దకు వెళ్లి శనివారం ఉదయం గల్లంతైన విషయం తెలిసిందే.. కాగా మండల అధికారులు మత్స్యకారుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం సాయంత్రం గుండి గ్రామ సమీపంలో మృతదేహం లభించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

యువత చూపు వైఎస్సార్‌టీపీ వైపు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న అజీమొద్దీన్

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రంలో యువత వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని వైఎస్సార్ టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ అన్నారు. ఆదివారం మంచిర్యాల, ఆర్‌కే6 కొత్త రోడ్, ప్రాంతాల యువకులు వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు కేసీఆర్ చేతిలో మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభుదేవ్, దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కవిరాజ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రేణెందర్ ప్రియదర్శిణి ఉన్నారు.

జాతీయస్థాయి వుషూ జడ్జీల ఎంపిక


సర్టిఫికెట్ తీసుకుంటున్న సతీశ్


సాయికృష్ణ

బెల్లంపల్లి/భైంసాటౌన్: జాతీయస్థాయి వుషూ జడ్జీలుగా నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన శ్రీరాముల సాయికృష్ణ, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన వేముల సతీష్ ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 23 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని సరళ బిర్లా యూనివర్సిటీ ప్రాంగణంలో వుషూ జడ్జీ, కోచ్‌ల శిక్షణ తరగతులు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 31 రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారం శిక్షణ తరగతులు ముగిసాయి. శిక్షణ పూర్తి చేసుకున్న సాయికృష్ణ, సతీష్‌లకు వుషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ జితేందర్ సింగ్ పజ్వా, సెక్రెటరీ విజయ్ శరాఫ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన చింతపూరి సత్యన్న ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.7500 విలువ గల ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నవోదయలో రాష్ట్ర క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని నవోదయ విద్యాలయంలో ఈనెల 27, 28వ తేదీల్లో రాష్ట్ర క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, వాలీబాల్ అండర్–14, 17, 19 విభాగాల బాలుర, బాలికలు, 'సుబ్రతా కప్' ఫుట్‌బాల్ అండర్–14, 17 బాలురులు, బాలికలు 17 బాలికల ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

మద్యం మాన్పిస్తున్నారు..!

జీవితం మారింది..

ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు తాగుతూ ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పడిపోయేవాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆ వ్యక్తిని ఇంటికి తీసుకెళ్లేవారు. కుటుంబీకులు సైతం విసుగుచెంది మద్యానికి బానిసైన వ్యక్తిని డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించారు. నెల రోజులపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో ఆయన పూర్తిగా మారిపోయాడు. మద్యం మానేశాడు. ఆ తర్వాత కష్టపడి పని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు. సొంత ఇంటిని నిర్మించుకున్నాడు. కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవిస్తున్నాడు.

- ఆదిలాబాద్‌లో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రభుత్వ జిల్లా ఆస్పత్రుల్లో డీ అడిక్షన్ సెంటర్లు


కౌన్సెలింగ్ ఇస్తున్న నిర్వాహకులు


పరీక్షిస్తున్న వైద్యుడు

సాక్షి, మంచిర్యాల డెస్క్: మద్యపానం అలవాటు వ్యసనంగా మారి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. కొందరు మద్యానికి బానిసగా మారి ఒళ్లు.. ఇల్లు గుల్ల చేసుకుంటూ ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మద్యానికి బానిసగా మారిన ఓ బాలుడు ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. మద్యానికి బానిసగా మాన్పించేందుకు జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏర్పాటు చేసింది. మంచిర్యాలలో మెంటల్ హెల్త్ క్లినిక్‌గా నిర్వహిస్తూ మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు ఇతర ఏ అలవాట్లు ఉన్నా చికిత్స అందిస్తున్నారు. సైకియాట్రిస్టు రెండు నెలలుగా ఓపీ చూస్తున్నారు. ఆదిలాబాద్‌లో డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తూ వందలాది మందిని మద్యం మాన్పించారు. మద్యానికి బానిసగా మారిన వారు ఆయా కేంద్రాల్లో కౌన్సెలింగ్ ద్వారా మారవచ్చు.

ఆదిలాబాద్‌లో 'స్వచ్ఛంద'ంగా..



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డవ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. 2005లో ప్రారంభించిన ఈ సెంటర్‌లో ఇప్పటివరకు 1200 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతీ నెల 15మంది చొప్పున ఈ కేంద్రంలో చేర్చుకుని కౌన్సెలింగ్, చికిత్స అందిస్తారు. 2022 సంవత్సరంలో 180మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ సెంటర్‌లో కౌన్సెలింగ్‌తోపాటు మందులు, యోగా, ఫ్యామిలీ, వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇస్తారు. ఉల్లాసం కోసం సాయంత్రం వేళల్లో ఆటలు ఆడిస్తుంటారు. కొందరిని బృందాలుగా ఏర్పాటు చేసి చర్చలు చేయిస్తారు. సైకియాట్రిస్టుతో వారానికి రెండు నుంచి మూడు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రోజుకు మూడు పూటల భోజనం ఉచితంగా అందిస్తారు. ప్రతీ రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, వారానికోసారి గుడ్డు కూరతో భోజనం పెడతారు. ఈ కేంద్రంలోనే కాకుండా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామాలకు వెళ్లి మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మద్యానికి, మత్తు పదార్థాలకు ఎవరైనా అలవాటు పడి వ్యసనంగా మారిన వారిని గుర్తించి ఈ సెంటర్‌లో చేర్చుకుంటారు. సర్పంచ్, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, పోలీసుల ద్వారా వివరాలు సేకరిస్తారు.

బానిసగా మారి బాలుడి ఆత్మహత్య

- మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని సత్యసాయినగర్ కాలనీకి చెందిన శివసాయి(16) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. కుటుంబ సభ్యులు మందలించడంతో జూన్ 27న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం కృష్ణపెల్లి గ్రామానికి చెందిన జయరాం(48) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జూన్ 29న ఇంట్లోనే ఉరేసుకున్నాడు.
- నిర్మల్ జిల్లా తానూరు మండల కేంద్రానికి చెందిన కారగిరి ఎల్లప్ప(40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జూలై 2న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- నిర్మల్ జిల్లా భైంసా మండలం గుండెగాం గ్రామానికి చెందిన బాలాజీ(28) కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసగా మారి భార్యాపిల్లలతో గొడవపడేవాడు. జూలై 6న గడ్డెన్నవాగుప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఆదిలాబాద్ జిల్లా మావల పోలీసుస్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన చిలుక రవీందర్(31) మద్యానికి బానిసగా మారి ఈ నెల 20న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తానిమడుగు గ్రామానికి చెందిన మోతె లింగయ్య(34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోయినా మద్యం మానలేదు. ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

కౌన్సెలింగ్, భోజన వసతి..

మద్యం, మత్తు పదార్థాలకు బానిసైన వారికి డవ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. నెలకు 15 మంది చొప్పున సెంటర్‌లో చేర్చుకోవడం జరుగుతుంది. దాదాపు 30 శాతం మంది మారుతున్నారు. ఈ సెంటర్‌లో చేరిన వారికి కౌన్సెలింగ్‌తోపాటు భోజనం అందిస్తాం. గ్రామాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైన మద్యానికి బానిసైతే డవ్ సెంటర్‌లో సంప్రదించవచ్చు.

– చంద్రశేఖర్‌రెడ్డి, డవ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

అన్ని అవయవాలపై ప్రభావం



మద్యపానం, మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరంలోని వెంట్రుకల నుంచి గోళ్ల వరకు అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. మద్యం అలవాటు ఉన్నవారిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి. మొదటి డి టాక్సిఫికేషన్ ట్రీట్‌మెంట్ అందించడం జరుగుతుంది. ఆ తర్వాడ డీ అడిక్షన్ చేస్తాం. వ్యక్తి ప్రశాంతంగా ఉండే విధంగా వైద్యం అందిస్తాం. అగోనెస్ట్ థెరపీ చేయడం జరుగుతుంది. పది రోజుల్లో సాధారణ స్థితికి వస్తారు. మద్యం జోలికి పోకుండా, మద్యమంటే ఇష్టపడకుండా ట్యాబ్లెట్లు ఇవ్వడం జరుగుతుంది. మద్యం సేవిస్తే రియాక్షన్ అయి వాంతులు, తలనొప్పి వంటివి జరిగి మద్యం జోలికి వెళ్లకుండా ఉంటారు. నెల రోజులపాటు వైద్యం అందిస్తాం. చాలామందిలో మార్పు వచ్చింది.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్, రిమ్స్

ఏడాదిగా మంచంలోనే..

- తాటిచెట్టు పైనుంచి పడి నడవలేని స్థితిలో గీత కార్మికుడు
- రూ.8లక్షలతో గతంలో ఆపరేషన్
- మళ్లీ ఆపరేషన్ చేయాలంటున్న వైద్యులు
- అందని ప్రభుత్వ సాయం..
- వెన్నెముక, చేతులకు మానని గాయాలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు
- కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న భార్య


మంచంలో గీతకార్మికుడు నగేశ్

జన్నారం: దేవుడు వరమిచ్చినా... పూజారి కరుణించడం లేదన్న చందంగా ఉంది గీత కార్మికుల పరిస్థితి. ప్రభుత్వం తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందినా... శాశ్వత వికలాంగులుగా మారిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే... అయితే నానా రకాల షరతులతో గీత కార్మికులు ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియాకు నోచుకోవడం లేదు. తాటి చెట్టుపై నుంచి పడి వెన్నెముక దెబ్బతిని, చేతి ఎముక విరిగి ఏడాదిగా మంచానికే పరిమితమైన గీత కార్మికుడికి ప్రభుత్వ సాయమందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో జన్నారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన సుద్దాల నగేశ్ ఏడాదిగా మంచానికే పరిమితమై మళ్లీ ఆపరేషన్ చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కులవృత్తితోనే బతుకు..

జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన సుద్దాల నగేశ్ (30) కల్లు గీత వృత్తితో భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. పదేళ్లుగా కుల వృత్తిని నమ్ముకుని బతుకుతున్నాడు. మార్చి 27, 2022న కులవృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగే క్రమంలో మోకుజారి చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. గమనించిన తోటి గీత కార్మికులు ఆస్పత్రికి తరలించారు. నడుం వెన్నుపూస, చేతి ఎముక, కాలు ఎముకలు విరిగిపోవడంతో ఆస్పత్రిలో రూ.8లక్షల వరకు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించారు. కానీ నేటికీ చేతి వెముక విరిగి బయటకు రావడంతో ఆపరేషన్ చేసి రాడ్ వేసి అతికించిన ఫలితం కానరావడం లేదు. దీంతో ఆ ఎముకను తొలగించాలని వైద్యులు సూచించారు. అయితే అప్పటికే అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్న నగేశ్ మళ్లీ ఆపరేషన్ చేయించుకోవడం కోసం చిల్లిగవ్వ లేక విలవిలలాడుతున్నాడు. అయితే కుటుంబ పోషణ భారంగా మారడంతో భార్య కూలి పనికి పోషించుకుంటుంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ...

చెట్టుపై నుంచి పడి ఏడాది అవుతున్నప్పటికీ నగేశ్ ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు ఇంటికి వెళ్లి పరిస్థితి గమనించి సమస్య రాసుకుని వెళ్లారు. ఎక్సైజ్ అధికారులు ఒక ప్రొఫార్మ ఇచ్చి పూర్తి చేసి హెల్త్ సూపరింటెండెంట్ సంతకంతో తీసుకురావాలని సూచించారు. దీంతో ఆరు నెలలుగా మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లనా సదరం సర్టిఫికేట్ మాత్రమే ఇస్తామని, ఎక్సైజ్ అధికారుల ప్రొఫార్మ ఇవ్వలేమని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారుల వద్దకు వెళ్లి చెప్పినప్పటికీ ప్రొఫార్మ కావాలని చెప్పడంతో నగేశ్ కుటుంబీకులు ఆందోళన చెందుతున్నాడు.

సదరం ఇస్తే

తాటిచెట్టుపై నుంచి పడి నడువలేని స్థితిలోని నగేశ్‌కు అధికారులు సదరం సర్టిఫికేట్ ఇస్తే ప్రభుత్వానికి ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అన్ని సర్టిఫికెట్లు పూర్తి చేసిన ఒక వైద్యాధికారుల నుంచి అందించే సదరం సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంది. ఈ సర్టిఫికేట్ ద్వారా శాశ్వత వికలాంగుడా, లేదా అనే విషయం అధికారులు ప్రొఫార్మాలో రాసి ఇవ్వాలి. అయితే తాను సదరం కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేయలేని స్థితిలో ఉన్నట్లు నగేశ్ పేర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు సహాయం చేయాలని కోరుతున్నాడు. అధికారులు స్పందించి ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్యంతో ఉన్న నగేశ్‌కు చేయూత అందించాలని కోరుతున్నాడు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

నగేశ్ తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలైన విషయం తెలియడంతో మా శాఖ నుంచి చేయాల్సిన ఫార్మలిటీస్ పూర్తి చేశాము. ప్రభుత్వానికి పంపించాం. నిబంధన ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన ప్రొఫార్మ మెడికల్ సూపరింటెండెంట్ పూర్తి చేసి సంతకం చేసి ఇవ్వాలి. ఇతర జిల్లాల్లో ఈ ప్రొఫార్మ ఇస్తున్నారు. ఇక్కడ మాత్రమే ఇవ్వడం లేదు. ఈ విషయంలో మాత్రమే ఆలస్యం అవుతుంది. సూపరింటెండెంట్ ప్రొఫార్మ పూర్తి చేసి ఇస్తే ప్రభుత్వానికి పంపిస్తాం. – సాయిబాబా, ఎక్సైజ్ సీఐ


తిర్యాణి: చింతల మాదర జలపాతం


నేరడిగొండ కొర్టికల్


పెంచికల్‌పేట్: కొండెంగ లొద్ది


హాజీపూర్: ర్యాలీ గ్రామ శివారులో


పెంచికల్‌పేట్: దొద్దులాయి

మహారాష్ట్రకు నిలిచిన రాకపోకలు


మునిగిన వెంకట్రావ్‌పేట్-పోడ్సా వంతెన

సిర్పూర్(టి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సిర్పూర్(టి) మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పెన్‌గంగ మీదుగా వెళ్లే మహారాష్ట్ర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్‌పేట్ –పోడ్సా అంతర్రాష్ట్ర వంతెన వరదనీటిలో మునిగిపోయింది. మండలంలోని హుడ్కిలి గ్రామ సమీపంలోని వాగులోకి పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో వాగుపై ఉన్న లోలెవల్ వంతెన వరదనీటిలో మునిగిపోవడంతో అంతర్రాష్ట్ర రహదారిలో మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగించే మహారాష్ట్ర పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

డీఎస్పీ పరిశీలన...

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సిర్పూర్(టి) మండలంలోని అంతర్రాష్ట్ర రహదారులను పరిశీలించారు. ఈ రహదారుల్లో ఎలాంటి ప్రయాణాలు సాగించకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

మణిపూర్ అల్లర్ల కారకులను శిక్షించాలి


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

మంచిర్యాలక్రైం: మణిపూర్ అల్లర్లకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాశీ సతీశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మణిపూర్ ఘటనకు నిరసనగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజీమొద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభుదేవ్, నాయకులు రాజేంద్రప్రసాద్, ఓరం కవి రాజ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రియదర్శిణి, జావిద్ పాషా, తేజ ఉన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

పాతమంచిర్యాల: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోని, కార్యదర్శి రేగుంట చంద్రకళ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఘటనకు నిరసనగా ఐబీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

వాగులోపడి పశువుల కాపరి మృతి

జన్నారం: మండలంలోని దేవునిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడకు చెందిన పశువుల కాపరి ప్రమాదవశాత్తు వాగులోపడి మృతిచెందాడు. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం... ఆరే ఎల్లయ్య (37) పశువుల కాపరి. ఆదివారం ఉదయం పశువులను తీసుకుని అడవిలోకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వాగులో మృతదేహం కనిపించడంతో కుటుంబీకులు వెళ్లిచూడగా ఎల్లయ్యదిగా గుర్తించారు. తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన గనులు ప్రారంభించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో నూతన భూగర్భ గనులను ప్రారంభించాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేకే–6, శ్రావణపల్లి గనులు పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ పనుల పూర్తి అయ్యాయని, అనుమతులు తీసుకువస్తే ఇంకా ఉద్యోగుల అవసరం ఏరియాలోనే ఉంటుందని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం లాభాల వాటా 35శాతం చెల్లించాలని చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాంబాబు, ఓదెలు, వెంకటస్వామి, శేఖర్, కుమార్, రవీందర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

కరాటే కోచ్‌గా నాగలక్ష్మి

మంచిర్యాలటౌన్: తెలంగాణ కరాటే అసోసియేషన్ గరల్స్ టీం కోచ్‌గా మంచిర్యాలకు చెందిన నాగలక్ష్మిని నియమించారు. రాష్ట్రస్థాయి కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఈ.శ్రీనివాస్, సెక్రెటరీ నరేందర్, కోశాధికారి సాయికుమార్ ఆమెకు నియామకపత్రం అందజేశారు.


నియామకపత్రం అందుకుంటున్న నాగలక్ష్మి

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి'

నస్పూర్: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆగస్టు 12వ తేదీన చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పాత పింఛన్ సాధన సంకల్ప యాత్ర చేపట్టారు. మంచిర్యాలలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. 2004 నుంచి అమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక భద్రత లేదన్నారు. నాయకులు కాసబోయిన సురేష్, ఇత్యాల కిషన్, మేడి శంకర్, బండ రాజేందర్, శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.